సాక్షి
బాపట్ల
మంగళవారం । 4 । ఏప్రిల్ । 2023



అమ్మవారికి తిరుమంజన సేవ

తాడేపల్లి రూరల్: విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై అష్టలక్ష్ముల ప్రతిష్టా వార్షికోత్సవాలు సోమవారం మూడో రోజుకు చేరాయి. అమ్మవార్లకు తిరుమంజన సేవ నిర్వహించారు.



దుర్గమ్మ సేవలో మంత్రి అంబటి

ఇంద్రకీలాద్రి: బెజవాడ దుర్గమ్మను మంత్రి అంబటి రాంబాబు సోమవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కె.రాంబాబు, ఈఓ భ్రమరాంబ స్వాగతం పలికారు.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సోమవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.



	ఇఫ్తార్ (మంగళ)	సహర్ (బుధ)
బాపట్ల	6:26	4:43
నరసరావుపేట	6:28	4:42
గుంటూరు	6:26	4:43

రంజాన్ వేళలు

అడ్డంకులు దాటి..అభివృద్ధి వైపు

కొత్త జిల్లా ఏర్పడి ఏడాది

- పల్లె ముంగిటకే పాలన
- స్థానికంగానే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు
- వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం
- గ్రామస్థాయిలోనే అన్ని సమస్యలకు పరిష్కారం



విద్యుత్ వెలుగుల్లో కలెక్టర్ కార్యాలయం

సాక్షిప్రతినిధి, బాపట్ల: గ్రామస్థాయికి పరిపాలనను తీసుకెళ్లి అక్కడికక్కడే ప్రజల సమస్యలు పరిష్కరించే లక్ష్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం జిల్లాల పునఃర్విభజన కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా బాపట్ల కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటుచేసింది. జిల్లా స్థాయి అధికార యంత్రాంగం మొత్తం జిల్లా కేంద్రానికి తరలివచ్చింది. దీంతో ప్రజలకు ప్రభుత్వం మరింత చేరువగా వచ్చింది. కలెక్టర్, ఎస్పీలతోపాటు అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం బాపట్ల జిల్లాను అభివృద్ధి బాటలో పయనింపచేస్తున్నారు. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమాలు ఏర్పాటుచేసి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నారు. ఉన్నతాధికారులు అందుబాటులో ఉండటంతో ఇన్నాళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కారానికి నోచుకుంటున్నాయి.

జిల్లా వ్యాప్తంగా 459 పంచాయతీలుండగా 418 గ్రామ సచివాలయాలు, 418 రైతుభరోసా కేంద్రాలతో పాటు విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు, బల్క్‌మిల్క్ యూనిట్లు సిద్ధం చేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడమే కాకుండా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందజేస్తున్నారు. రైతులు పండించిన పంటలను మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో దళారుల బెడద లేకుండా అన్నదాతలకు గిట్టుబాటు ధరను కల్పించారు. దీంతో జిల్లాలో వ్యవసాయ రంగం మరింత వృద్ధి సాధించింది. సచివాలయాల ఏర్పాటుతో 4398 వేలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. వాలంటరీ వ్యవస్థ ఏర్పాటుతో వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. జిల్లా వ్యాప్తంగా పలు పరిశ్రమలు ఏర్పాటుచేసి తద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. బాపట్ల జిల్లా కేంద్రం కావడంతో రూ. వందల కోట్లతో రోడ్ల విస్తరణ చేశారు. నిజాంపట్నంలో హార్బర్ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. తీరప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా టూరిజం అభివృద్ధి చేసేవిధంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. జిల్లా ఎస్పీ కార్యాలయం అందుబాటులోకి రావడంతో జిల్లావ్యాప్తంగా నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంలో భాగంగా కృష్ణా డెల్టా ఆధునికీకరణ పనులు చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించడం జరిగింది. ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి.

బాపట్లకు మణిహారం మెడికల్ కళాశాల

విద్యాకేంద్రంగా విరాజిల్లుతున్న బాపట్లలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ తదితర కళాశాలలు ఉన్నా మెడికల్ కళాశాల లేని కొరత ఉండేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ఆ కొరత కూడా తీరింది. జిల్లా కేంద్రంలో రూ.510 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మిస్తున్నారు. పనులు చురుగ్గా సాగుతున్నాయి.

రెవెన్యూ డివిజన్‌గా రేపల్లె

పాలన వికేంద్రీకరణలో భాగంగా ప్రభుత్వం బాపట్ల, చీరాలలను రెవెన్యూ డివిజన్లుగా ప్రకటించింది. తర్వాత రేపల్లెను కూడా రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించింది.దీంతో తీర ప్రాంత ప్రజలకు పరిపాలన మరింత చేరువైంది.

నేడు ఏడాది సంబరాలు

బాపట్ల జిల్లా ఏర్పడి మంగళవారం నాటికి ఏడాది అయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పండుగ సంబరాలు పెద్దఎత్తున నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్‌లతోపాటు అన్నిశాఖల అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు కూడా పాల్గొనున్నారు. పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్దడానికి ప్రణాళిక



బాపట్ల జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతున్నాం. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన జిల్లా అభివృద్ధి చెందాలంటే ముందుగా రైతాంగాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రైతుల సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పట్టాలు అందించేందుకు అవసరమైన కసరత్తు చేపట్టాం. త్వరలో రైతులకు సీఎం చేతుల మీదుగా పట్టాలు అందజేయనున్నాం. భూగర్భ జలాలను మెరుగుపర్చడానికి కృష్ణానదిపై చెక్ డ్యామ్ నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. రూ.1350 కోట్ల అంచనాతో చెక్‌డ్యామ్ నిర్మాణం జరగనుంది.

– మేరుగ నాగార్జున, రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి

బాపట్ల జిల్లాతో చీరాలకు బహుళ ప్రయోజనం



పరిపాలన వికేంద్రీకరణ, రాష్ట్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. జిల్లాల పునర్విభజనలో నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో చీరాల నియోజకవర్గ అభివృద్ధికి బహుళ ప్రయోజనం ఏర్పడింది. జిల్లా, డివిజనల్ స్థాయి చీరాలకు రావడంతో పాటుగా చీరాల రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయడం శుభపరిణామం. చీరాలను అన్ని రంగాలుగా ముందంజలో నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం.

–ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, చీరాల

అభివృద్ధి బాటలో జిల్లా



బాపట్ల కొత్త జిల్లాగా ఏర్పాటైన ఏడాదిలో అభివృద్ధికి బాటలు పడ్డాయి. ఏడాది కిందట కొత్త జిల్లాగా ఏర్పడిన సందర్భంలో వసతుల లేమితోపాటు పలు రకాల ఇబ్బందులు ఉండేవి. ఆ తర్వాత సమస్యలను అధిగమించి జిల్లాలో పాలనను గాడిలో పెట్టాం. అభివృద్ధి పనులు వేగవంతం చేశాం. నాడు–నేడు ద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. రోడ్ల విస్తరణ పనులు చేపట్టాం. జేసీ, ఎస్పీలతోపాటు ఇతర అధికారులను సమన్వయం చేసుకొని జిల్లా అభివృద్ధికి అహర్నిశలు కృషిచేస్తున్నాం. ఏప్రిల్ నెలతో ప్రత్యేక అనుబంధం ఉంది. ఏప్రిల్ 4న కొత్త జిల్లా కలెక్టర్‌గా వచ్చాను. ఏప్రిల్ 9న నా జన్మదినోత్సవం.

– కె.విజయకృష్ణన్, జిల్లా కలెక్టర్

సంతోషంగా ఉంది



కొత్త జిల్లాగా ఏర్పడిన బాపట్ల జిల్లాకు ఏడాది కిందట జాయింట్ కలెక్టర్‌గా వచ్చాను. జిల్లాలో జరిగిన అభివృద్ధి పనుల్లో భాగస్వామి అయినందుకు ఆనందంగా ఉంది. ఆదిలో ఇబ్బందులున్నా ప్రస్తుతం వాటన్నింటినీ అధిగమించాం. అన్నిశాఖల అధికారులను కలుపుకొని జిల్లా అభివృద్ధికి పనిచేశాం. ప్రధానంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషిచేశాం. వేలాది ఎకరాల చుక్కల భూముల సమస్య పరిష్కరించాం. అసైన్డ్ భూముల వ్యవహారంపైన ప్రత్యేక దృష్టిసారించాం. రీసర్వే వేగవంతం చేశాం. – డాక్టర్ శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్

నేరాల అదుపునకు చర్యలు చేపట్టాం



కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లాకు ఎస్పీగా వచ్చే నాటికి ఇక్కడ ఏమీలేవు. కొంత కాలానికి వసతులు ఏర్పాటు చేసుకున్నాం. ప్రస్తుతం అన్నిరకాల వసతులు సమకూరాయి. నేరాలను అదుపు చేయగలిగాం. రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి. గంజాయి, మాదకద్రవ్యాల వైపు యువత ఆకర్షితులు కాకుండా కళాశాలల్లో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. రేపల్లెకు కొత్త డివిజనల్ పోలీస్ కార్యాలయం ఏర్పాటుచేశాం. సిబ్బంది సంక్షేమానికి ప్రత్యేక కృషిచేస్తున్నాం. రాజకీయ ఒత్తిళ్లు లేవు. ఉన్నతాధికారులను సమన్వయం చేసుకొని పనిచేస్తున్నాం. ఏడాది పాలన తృప్తిగా ఉంది.

–వకుల్‌జిందాల్, ఎస్పీ

గణనీయంగా చీరాల అభివృద్ధి



బాపట్ల జిల్లా ప్రధాన కేంద్రం అయినప్పటికీ చీరాలలో మాత్రం ప్రభుత్వ భూములు, వనరులు పుష్కలంగా ఉండటంతో చీరాల అభివృద్ధిలో ముందుంటుంది. మౌలిక వసతులు, అభివృద్ధి పనులు వేగవంతం అవ్వడంతో పాటుగా వ్యాపార రంగాలు రాణిస్తున్నాయి. అన్నీ వర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.

– పోతుల సునీత, ఎమ్మెల్సీ

న్యూస్‌రీల్

అంబేడ్కర్‌పై వివాదాస్పద పోస్టులు పెట్టిన వ్యక్తిపై దాడి

రేపల్లె రూరల్: సోషల్ మీడియాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై వివాదాస్పద పోస్టులు పెట్టిన వ్యక్తిపై దళిత బహుజనులు మూకుమ్మడి దాడికి పాల్పడిన సంఘటన సోమవారం రాత్రి రేపల్లె పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... రేపల్లె పట్టణంలోని పాత స్టేట్ బ్యాంక్ రోడ్డులో నివాసముంటూ ప్రైవేటు బ్యాంక్‌లో పనిచేస్తున్న ఈశ్వర్ సోషల్ మీడియాలో అంబేడ్కర్‌పై వివాదాస్పద, అసభ్యకరంగా పోస్టులు పెట్టాడు. సామాజిక మాధ్యమాలలో ఈ పోస్టులను చూసిన దళిత బహుజనులు ఈశ్వర్‌పై ఇంటిపై మూకుమ్మడిగా దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐలు అబ్దుల్ రజాక్, భరత్‌లు తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్న దళిత బహుజనులను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. తీవ్రగాయాలైన ఈశ్వర్‌ను ఎస్‌ఐ వ్యక్తిగత కారులో వైద్యశాలకు తరలిస్తుండగా అడ్డుకున్న దళిత బహుజనులు మరోమారు ఈశ్వర్‌పై దాడిచేయటంతోపాటు కారును ధ్వంసం చేశారు. ఈ సమయంలో పోలీసు సిబ్బందికి, దళిత బహుజనుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. చివరికి ఈశ్వర్‌ను అంబులెన్స్‌లో మెరుగైన చికిత్స కోసం గుంటూరు తరలించినట్లు సమాచారం. అంబేడ్కర్‌పై అసభ్యకరంగా పోస్టులు చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి, ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ విజయచంద్ర తెలిపారు.

నేటి నుంచి ఒంటి పూట అంగన్‌వాడీ బడులు

నెహ్రూనగర్: అంగన్‌వాడీ కేంద్రాలు మంగళవారం నుంచి ఒంటి పూట పనిచేయనున్నాయి. ఉదయం 8 గంటలకు అంగన్‌వాడీ కేంద్రాలు ప్రారంభమై మధ్యాహ్నం 12 గంటలకు వరకు పనిచేస్తాయని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.మనోరంజని సోమవారం తెలిపారు. మే 31వ తేదీ వరకు అమలులో ఉంటుందని చెప్పారు.

సీఎం పర్యటనకు సమన్వయంతో పనిచేయండి

నరసరావుపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఫ్యామిలీ ఫిజిషియన్' కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ డివిజన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో ముఖ్యమంత్రి పర్యటనపై ఆదివారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల ఆరో తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిలకలూరిపేట లింగంగుంట నుంచి లాంఛనంగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. సామాన్య ప్రజానీకానికి ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని కోరారు. ఏఎన్‌ఎంలు అందరూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా పార్కింగ్ సమస్య ఎదురు కాకుండా చూడాలన్నారు. జేసీ ఏ శ్యాంప్రసాద్, డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి బాపట్ల జిల్లాకు చెందిన భక్తులు రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. బాపట్ల జిల్లా ఖాజీపాలెంనకు చెందిన మంతెన సుబ్బరాజు, సత్యవతి దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు సోమవారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం అందజేశారు. దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించారు. వేదపండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు. పాలక మండలి సభ్యురాలు బచ్చు మాధవీకృష్ణ పాల్గొన్నారు.

వెండితెరపై 'టైగర్ నాగేశ్వరరావు'



స్టువర్టుపురం ఏరియల్ వ్యూ (ఇన్‌సెట్) టైగర్ నాగేశ్వరరావు ఫైల్

ఉమ్మడి గుంటూరు జిల్లాలోని స్టువర్టుపురానికి చెందిన ఒకనాటి గజదొంగ టైగర్ నాగేశ్వరరావు. పెద్దలను కొట్టి పేదలకు పంచిన రాబిన్‌హుడ్‌గా ఫ్యాన్ పాలోయింగ్ కలిగిన నేరస్తుడు. పోలీసు అధికారులకు ముందుగా చెప్పి జైలు నుంచి తప్పించుకున్న 'టైగర్'. పట్టుకోలేరంటూ సవాల్ చేసి మరీ నేరాలు చేసిన తెంపరి. పోలీస్ ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాక వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమాన జనంతో ఆయన అంతిమ యాత్రకు మూడు రోజులు పట్టింది. మృతి చెందిన 43 ఏళ్లకు నాగేశ్వరరావు జీవిత కథ సినిమాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. గజదొంగ హీరోయిజమే ఈ పాన్‌ఇండియా సినిమాకు ప్రేరణ. 'మాస్ మహరాజ్' రవితేజ ఈ చిత్ర హీరో.

– గుంటూరు డెస్క్

- పెద్దలను కొట్టి పేదలకు పంచిన రాబిన్‌హుడ్
- పోలీసులకు చెప్పి మరీ నేరాలు చేసిన గజదొంగ
- ఎన్‌కౌంటర్‌లో హతుడైన 43 ఏళ్లకు బయోపిక్
- రవితేజ హీరోగా దసరాకు రానున్న పాన్‌ఇండియా సినిమా

విజయవాడ–చెన్నై రైలు మార్గంలో బాపట్ల సమీపంలో ఉంటుంది స్టువర్టుపురం. 1874 సెటిల్‌మెంట్ చట్టం ప్రకారం ఏర్పడిన గ్రామం. వివిధ ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడేవారిని, ఇతర నేరస్తులను గుర్తించి నిఘా ఉంచేందుకని ఇక్కడ నివాసం కల్పించారు. అప్పటి మద్రాస్ ప్రెసిడెన్సీ హోం సభ్యుడు హెరాల్ట్ స్టువర్ట్ పేరుతో గ్రామానికి నామకరణం చేశారు. నేరాల్లో ఆరితేరిన వారు ముఠాలుగా వివిధ రాష్ట్రాల్లో దోపిడీ, దొంగతనాలకు పాల్పడేవారు. స్టువర్టుపురం దొంగలంటేనే జనంలో ఒకరకమైన భీతి ఉండేది. టైగర్ నాగేశ్వరరావు తెర పైకి వచ్చాక ఆ గ్రామం పేరు మరింతగా కలకలం రేపింది. తోటి దొంగలకు హీరోగా, పేదలకు ఆపద్బాంధవుడిగా, పోలీసులకు కొరకరాని కొయ్యగా తయారయ్యాడు. దొంగతనాలు వారసత్వంగా కలిగిన కుటుంబంలో ఇద్దరు అన్నల తర్వాత గరిక నాగేశ్వరరావు జన్మించాడు. జనన సంవత్సరం 1953–56 మధ్య. సోదరులు ప్రసాద్, ప్రభాకర్. వీరి చిన్నతనంలోనే తల్లి చనిపోయింది. మరికొన్నేళ్లకు తండ్రినీ కోల్పోయారు. తండ్రి బాటలోనే దొంగతనాలు చేస్తున్న ప్రభాకర్ ఆచూకీ కోసం ప్రయత్నించి విఫలమైన పోలీసులు, సోదరుడైన నాగేశ్వరరావును తీసుకెళ్లి, తీవ్రంగా హింసించారు. ఏ నేరం చేయకుండానే పోలీసుల చిత్రహింసలు అనుభవించిన 15 ఏళ్ల నాగేశ్వరరావు తండ్రి, అన్న బాటలోనే నేరస్తుల జత కట్టాడు. 1970లో తమిళనాడు వెళ్లి మారుపేర్లతో నివాసముంటూ దొంగతనాలు ఆరంభించాడు. అన్న జైలు నుంచి విడుదలై వచ్చాక అతడి ముఠాలో పనిచేయసాగాడు.

'ఆంధ్రా టైగర్‌రా'...

ఒక పర్యాయం తమిళనాడు పోలీసులు అన్నదమ్ములను అరెస్టు చేశారు. తిరువాళ్లూరు జైలులో ఉన్న నాగేశ్వరరావును అప్పటి ఐజీ అరుళ్ విచారించారు. తనను చిత్రహింసలు పెడితే రెండు రోజుల్లో జైలు నుంచి పారిపోతానని నాగేశ్వరరావు ఐజీతో స్పష్టంగా చెప్పాడు. అన్న వద్దని చెప్పినా వినకుండా, సబ్‌జైలు నుంచి పోలీసులను కొట్టి మరీ పరారయ్యాడు. తనను వెతుక్కుంటూ స్టువర్టుపురం వచ్చిన పోలీసులనూ కొట్టాడు. 'వచ్చే నెలలో మద్రాస్ సిటీలోనే నేరం చేస్తాను... దమ్ముంటే పట్టుకోమను' అంటూ వారిని పంపేశాడు. అన్నట్టుగానే మద్రాస్ సిటీలో వరుసగా మూడు నెలలు దొంగతనాలు చేసి పోలీసులను ముప్పుతిప్పలు పెట్టాడు. విసుగెత్తిపోయిన ఐజీ అరుళ్ నిజంగా వాడు 'ఆంధ్రా టైగర్‌రా' అన్నాడు. అప్పట్నుంచి నాగేశ్వరరావు ఇంటి పేరు టైగర్ అయింది. ఏపీ, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 15 ఏళ్లపాటు దొంగతనాలు, దోపిడీలకు పాల్పడిన టైగర్ నాగేశ్వరరావు పోలీసులకు సింహస్వప్నంగా మారాడు. 1974లో జరిగిన బనగానపల్లె బ్యాంకు దోపిడీ అందులో ఒకటి. పోలీస్‌స్టేషనుకు అత్యంత సమీపంలో ఉండే బ్యాంకును నాగేశ్వరరావు ముఠా కొల్లగొట్టింది. గ్రామాన్ని చుట్టుముట్టిన పోలీసులకు ప్రభాకరరావు దొరికాడు మినహా నాగేశ్వరరావు ఆచూకీ దొరకలేదు. ఒక బిస్కట్ కంపెనీ అధినేత, అప్పటి హోంశాఖ సహాయమంత్రి వియ్యంకుడి కుటుంబాన్ని దారికాచి దోచారు.

పట్టుకునేందుకు పోలీసుల వ్యూహం ...

తలనొప్పిగా మారిన నాగేశ్వరరావును ఎలాగైనా మట్టుపెట్టాలని పోలీస్ శాఖలోని కొందరు అధికారులు సిద్ధమయ్యారు. మరొక దొంగ ఇచ్చిన సమాచారంతో నాగేశ్వరరావు తరచూ ఒక మహిళ ఇంటికి వచ్చి వెళుతుంటాడని తెలుసుకున్నారు. డబ్బాశ చూపారు. పాలల్లో మత్తుమందు కలిపి, తమకు సంకేతం ఇవ్వాలని, లేకుంటే తనను చంపేస్తామని బెదిరించారు. భయపడిపోయిన ఆ మహిళ తర్వాత నాలుగు రోజులకు 1980 మార్చి 24న తెల్లవారుజామున ఇంటికి వచ్చిన నాగేశ్వరరావుకు పోలీసులు చెప్పినట్టే మత్తుమందు కలిపిన పాలు తాగించింది. మత్తులో నిద్రపోతున్న అతడిపై పోలీసు అధికారి తుపాకీ కాల్పులు జరిపాడు. పోలీస్‌వ్యానులో ఊరి బయటకు తీసుకెళ్లి మరోసారి తూటా పేల్చి చంపేశారు. ఎన్‌కౌంటరులో హతమైనట్టు ప్రకటించారు. శవపరీక్ష నిమిత్తం చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ్నుంచి ఆరంభమైన అంతిమయాత్ర స్టువర్టుపురం కాలనీకి చేరేందుకు మూడురోజులు పట్టిందట!

మహిళలంటే గౌరవం...



మేం ఒకప్పుడు దొంగతనాలు చేసినా, మహిళలంటే మాకెంతో గౌరవం...ఒంటరిగా ఉన్నా బంగారం, డబ్బు దోచుకునేవాళ్లం మినహా ఎలాంటి అకృత్యాలకు పాల్పడేవాళ్లం కాదు... నేటికాలంలో ఆడవాళ్లపై జరుగుతున్న ఘోరాలు వింటుంటే బాధ కలుగుతోంది. నా సోదరుడు నాగేశ్వరరావు ఆర్థికసాయం కూడా చేసేవాడు. సినిమా తీస్తున్నారు. నన్ను కూడా వివరాలు అడిగారు.

– గరిక ప్రభాకరరావు, నాగేశ్వరరావు సోదరుడు

సుదీర్ఘ పరిశోధన చేశాం...



'దొంగాట' సినిమా చేసేటపుడు ఒక పెద్దాయన ద్వారా టైగర్ నాగేశ్వరరావు గురించి తెలిసింది. దొంగైనా అతడు రాబిన్‌హుడ్ అని చెప్పటంతో ఆసక్తి కలిగింది. వైవిధ్యమైన సినిమాలు, అందులోనూ ఏదైనా బయోపిక్ కూడా తీయాలనుకున్న నాకు, అతడి జీవితంలోని కమర్షియల్ ఎలిమెంట్ నచ్చింది. అప్పట్నుంచి పరిశోధన మొదలైంది. ఆసక్తిదాయకమైన అంశాలతో సినిమా తీస్తున్నాం. – వంశీకృష్ణ, సినీదర్శకుడు

చదువులు, వైద్యం, పెళ్లిళ్లకు సాయం ...

దొంగతనాలు, దోపిడీలు చేసినా నాగేశ్వరరావు మిగుల్చుకుంది ఏమీ లేదంటారు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు చీరాల, చుట్టుపక్కల పల్లెల్లోనే తలదాచుకునే వాడు. ఆశ్రయం ఇచ్చిన, సహాయంకోరిన వారికి ఆర్థిక సహాయం చేసే వాడు. పిల్లల చదువులు, వైద్యం, పెళ్లిళ్లకు సాయం చేసేవాడు. అతని ఆర్థిక సాయంతో డాక్టర్లు, ఇంజినీర్లు అయినవాళ్లు ఉన్నారని అంటుంటారు. పొగాకు కంపెనీ యజమాని అరాచకంపై మహిళల్ని పోరుబాటకు సిద్ధం చేయటమే కాదు..వత్తాసుగా వచ్చిన ఎస్‌ఐపై దాడి చేయించాడు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.6,000, గరిష్ఠ ధర రూ.8,100, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

పది పరీక్షలు ప్రారంభం



బాపట్ల పబ్లిక్ స్కూల్‌లో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులు

- తొలి రోజు 99.08 శాతం విద్యార్థుల హాజరు
- పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ జిందాల్

బాపట్లఅర్బన్: జిల్లాలో పది పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 103 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 16,869 మంది విద్యార్థులకుగాను 16,714 మంది పరీక్షకు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి పీ.జే.వీ.రామారావు తెలిపారు. జిల్లా ఉన్నత విద్యాశాఖాధికారులు చీరాల, పర్చూరు, బాపట్లలోని పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల్లో వసతులు పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు 48 కేంద్రాలు, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు మిగతా పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. మాల్ ప్రాక్టీస్ గానీ, ఇతర అవాంఛనీయ సంఘటనలుగానీ చోటుచేసుకోలేదని వెల్లడించారు. ప్రతి విద్యార్థి పరీక్ష కేంద్రానికి త్వరగా చేరుకునేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంది. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత రవాణా సౌకర్యం కల్పించింది. అదే సమయంలో పరీక్ష కేంద్రాల వద్ద తాగు నీరు, షామియానాలు, విద్యుత్ వంటి వసతులను ఏర్పాటు చేసింది. విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్ష రాసేందుకు అధికారులు వీలు కల్పించారు.

పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

చీరాల: పది పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. సోమవారం తెలుగు పరీక్ష ప్రారంభం కాగా చీరాలలో పరీక్ష కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. కేంద్రాల్లోని గదులను పరిశీలించి బందోబస్తుపై చీరాల డీఎస్పీ శ్రీకాంత్, టౌన్ సీఐ మల్లికార్జునతో చర్చించారు. మీడియాతో ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లా పరిధిలో 103 పరీక్ష కేంద్రాలు ఉన్నాయని, ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్‌తో పాటు పటిష్టంగా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మహిళా పోలీసులకు అన్నీ కేంద్రాల వద్ద విధులు కేటాయించామన్నారు. ఇన్విజిలేషన్‌లో ఉన్న ఉపాధ్యాయులు, ఉన్నతాధికారులకు ఫోన్లు కూడా అనుమతి లేదని చెప్పారు. పది పరీక్షలు పూర్తయ్యేవరకు బందోబస్తు చేస్తున్నారని, కేంద్రాలకు కిలో మీటర్‌లోపు ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయించామన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.



పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

పరీక్షలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలి

బాపట్ల: జిల్లాలో పది పరీక్షలు సజావుగా నిర్వహించడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. బాపట్ల మున్సిపల్ హైస్కూలులోని పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సోమవారం పరిశీలించారు. విద్యార్థులు ఒత్తిడికి లేకుండా పరీక్షలు రాయాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించారు. డీఈఓ రామారావు, బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు, డో రవీంద్ర, మున్సిపల్ కమిషనర్ భానుప్రతాప్, తహసీల్దార్ కవిత ఉన్నారు.

సీఎం సమీక్ష సమావేశానికి హాజరైన ఇన్‌చార్జి కరణం



చీరాల: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తాడేపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశానికి చీరాల నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ హాజరయ్యారు. ముఖ్యమంత్రి సూచించిన ప్రతి విషయాన్ని నియోజకవర్గంలో తూచా తప్పకుండా పాటించి నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

ఎలుకల మందు తిని వ్యక్తి మృతి

వేమూరు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ యువకుడు ఎలుకలమందు తిని మృతి చెందిన సంఘటన. వేమూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ శ్యామూల్ రాజీవ్‌కుమార్ తెలిపిన వివరాలు...వేమూరు అంబేద్కర్‌నగర్‌కు చెందిన బండారు గోపి(32) ఆయన భార్య మధ్య విభేదాలు చోటుచేసుకున్నాయి. ఆదివారం రాత్రి 8 గంటలకు ఎలుకలమందు తీసుకున్నాడు. ఎలుకలమందు తినడం చూసిన తల్లి చుట్టుపక్కల వారికి తెలిపింది. వారు 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు వైద్య సేవలు అందించారు. సోమవారం ఉదయం 10గంటలకు మృతి చెందాడు.

రెవెన్యూ డివిజన్‌తో చీరాల ప్రజల కల సాకారం

- ఇళ్ల పట్టాలు, రెవెన్యూ డివిజన్ కార్యాలయం ప్రారంభం
- కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కరణం



సిలోన్ కాలనీ ప్రజలకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే కరణం

చీరాల: పరిపాలన సౌలభ్యం కలగడంతో దశాబ్దాలుగా చీరాల ప్రజల కల సాకారం అయ్యిందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. సోమవారం రాత్రి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో కలెక్టర్ పాల్గొన్నారు. ముఖ్యంగా చీరాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని రూ.40 లక్షలతో ఆధునికీకరణ ప్రారంభోత్సవం, అలానే నాడు–నేడు నిధులు రూ.60 లక్షలతో ఎన్‌ఆర్ అండ్ పీఎం హైస్కూల్లో నిర్మించిన డైనింగ్ హాల్‌ను ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తితో కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఆర్డీవో సరోజిని అధ్యక్షత వహించారు. ఈసభలో కలెక్టర్ మాట్లాడుతూ చీరాల రెవెన్యూ డివిజన్ కార్యాలయం ఏర్పాటు అవడంతో చీరాల అభివృద్ధికి ఎంతో మేలు చేస్తుందన్నారు. రెవెన్యూ డివిజన్ తీసుకురావడంలో ఎమ్మెల్యే కరణం బలరాం కృషి చాలా ఉందన్నారు. ఆయన అన్నీ హంగులతో కార్యాలయంలో సౌకర్యాలు ఆధునికీకరించారన్నారు. అలానే 40 ఏళ్ల నుంచి సమస్యగా ఉండి పరిష్కారం కాని వేటపాలెం మండలం సిలోన్‌కాలనీ వాసులకు పట్టాలు అందించడం ఆనందంగా ఉందన్నారు. సమస్యను ఎమ్మెల్యేతో పాటుగా నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు పలుమార్లు తమ దృష్టికి తీసుకురావడంతో జాయింట్ కలెక్టర్‌తో చర్చించి నిబంధనల్లో కొన్ని మార్పులు చేసి పట్టాలు అందిస్తున్నామన్నారు. ఎప్పుడో 40 ఏళ్ల క్రితం ప్రకాశం జిల్లాలో మూలనపడిన సమస్యలను తమకు అందించి వారికి పట్టాలు అందించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఇందులో జేసీ, ఆర్డీవో, రెవెన్యూ అధికారుల కృషి మరువలేనిదన్నారు.

చీరాలకు జిల్లా కోసం ప్రయత్నించాం..

ఎమ్మెల్యే కరణం మాట్లాడుతూ చీరాలను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించామని అయితే బాపట్లకు జిల్లాను కేటాయించారన్నారు. దీంతో తాను చీరాలను రెవెన్యూ డివిజన్ చేయాలని తాను సీఎం వైఎస్ జగన్‌ను కోరగా సీఎం సానుకూలంగా స్పందించి రెవెన్యూ డివిజన్ చేయించారన్నారు. దీన్ని వలన పరిపాలన సౌలభ్యం జరిగిందన్నారు. రూ.40 లక్షలతో జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ఆర్డీవో కార్యాలయాన్ని ఆధునికీకరణ చేశామన్నారు. అలానే సిలోన్ కాలనీ సమస్యను పరిష్కరించి కొత్త జిల్లా ఏర్పడి ఏడాది పూర్తి అయినందున వారికి పట్టాలు అందించడం ఆనందంగా ఉందన్నారు.

నిత్యం ఒంగోలు వెళ్లే సమస్య తీరింది..

కరణం వెంకటేష్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై చీరాల ప్రజలు నిత్యం ఉమ్మడి జిల్లా కేంద్రమైన ఒంగోలు వెళ్లాల్సి ఉండేది. చీరాల రెవెన్యూ డివిజన్‌గా ఏర్పడటంతో సమస్య పరిష్కారం అవడంతో పాటుగా చీరాల పరిసర నియోజకవర్గాల ప్రజలకు చాలా మేలు చేకూరిందన్నారు. గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో సిలోన్ కాలనీ వాసులు తమ దృష్టికి ఇళ్ల పట్టాల సమస్యలను తెచ్చారన్నారు. 40 ఏళ్లుగా నివాసం ఉంటున్న పట్టాలు అందించకపోవడంతో కలెక్టర్ స్పందన దృష్టికి తీసుకువెళ్లగా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకని అధికారులతో నిత్యం మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం విశేషమన్నారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్లు జైసన్‌బాబు, రామసుబ్బులు, కమీషనర్ రామచంద్రారెడ్డి, కార్పొరేషన్ డైరెక్టర్ గవిని శ్రీనివాస్, చీరాల వేటపాలెం తహశీల్దార్లు ప్రభాకరరావు, మహేశ్వరి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

కన్న కొడుకే కడతేర్చాలని చూస్తున్నాడు

- స్పందనలో ఎస్పీ ముందు ఆవేదన వ్యక్తం చేసిన బాధితులు
- అండగా ఉంటామంటూ భరోసానిచ్చిన ఎస్పీ వకుల్ జిందాల్



జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్‌కు ఫిర్యాదుచేస్తున్న బాధితులు

నాకు నలుగురు సంతానం. నాకు హక్కు కలిగిన స్థలంలో ఉన్న రేకుల షెడ్డులో తలదాచుకుంటున్నా. నా నాల్గవ కుమారుడు వెంకటప్రసాద్ ఆ ఇంట్లోకి వెళితే చంపుతానని బెదిరిస్తున్నాడు. నా కుమారుడు చెర నుంచి నన్ను ఎలాగైనా మీరే కాపాడాలి.

–మలిశెట్టి ఆంజనేయులు, 3వ వార్డు, బాపట్ల పట్టణం

బాపట్లటౌన్: జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి సమస్యలు వెలువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు నేరుగా ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్‌లను కలిసి తమ సమస్యలు వివరించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించిన ఎస్పీ వకుల్‌జిందాల్ సంబంధిత పోలీస్‌అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు.

నాకు ప్రాణహాని ఉంది

మా గ్రామంలోని సర్వేనెంబర్ 86/1, 86/2లో ఐదెకరాల జీడిమామిడి తోట ఉంది. దానిని మా మరిది ధర్మజ్ఞాని ఆక్రమించుకున్నాడు. ఇదేమని అడిగితే ఆయన కుమారుడు జి.భాగ్యరాజు (కానిస్టేబుల్), ఆయన అల్లుడు జి.కిరణ్‌కుమార్ (కానిస్టేబుల్)లు నీకు దిక్కున్నచోట చెప్పుకోమంటూ బెదిరిస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామ పెద్దలతో చెప్పినప్పటికీ ప్రయోజనం లేదు. నన్ను చంపుతామని బెదిరిస్తున్నారు. వారి వలన నాకు ప్రాణహాని ఉంది.

– గొర్రుముచ్చు మణిమాల, దేశాయిపేట, వేటపాలెం మండలం

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామంటూ డబ్బులు తీసుకున్నారు

నా కుమారుడు కార్తీక్‌కు ఫిలిఫెన్స్‌లోని వర్జిన్ మిలగ్రేస్ యూనివర్సిటీలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని చెప్పి ఒంగోలులోని గేట్‌వే టు ది ఓరల్డ్ కన్సల్టెన్సీకు చెందిన ఎ. వీరాంజనేయులు రూ.9.50 లక్షలు తీసుకున్నారు. కళాశాలకు కేవలం రూ.45 వేలు చెల్లించి మిగిలిన సొమ్ము స్వాహా చేశారు. న్యాయం చేయండి.

–ధూళిపూడి సునీత, జెండా చెట్టు సెంటర్, బాపట్ల

– నా కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తానని చెప్పి రూ.7.50 లక్షలు తీసుకున్నారు. మోసపోయాం. మమ్మల్ని ఆదుకోండి.

–మహ్మద్ నస్రిరాబేగం, బాపట్ల

భూమిలో అడుగుపెడితే చంపుతామంటున్నారు

మా గ్రామంలోని 217 సర్వే నెంబర్‌లో 67 సెంట్ల భూమి ఉంది. మా గ్రామానికి చెందిన కట్టా సుబ్బారావు, నర్రా రామారావు, జంపాని నాగేశ్వరరావులు నా పొలంలోకి నిత్యం మురుగు వదులుతున్నారు. ఇదేమని అడిగితే అసలు నీవు పొలంలోకి వచ్చావంటే చంపుతానని బెదిరిస్తున్నారు. నేను వారితో పోరాడే శక్తి లేక నా పొలాన్ని ఖాళీగా పెట్టుకుంటున్నాను. వారి వలన నాకు ప్రాణహాని ఉంది.

–దొడ్డ సుగణరావు, చిమ్మిరిబండ, మార్టూరు మండలం

7న స్టువర్టుపురంలో బజరంగ్ 'జగన్నామ సంక్షేమం'

- మహిళలకు శానిటరీ నాప్‌కిన్లు పంపిణీ
- వలంటీర్లకు అవగాహన–పోటీ పరీక్ష
- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ వెల్లడి

కొరిటిపాడు(గుంటూరు) : ఈ నెల 7వ తేదీన బాపట్ల జిల్లా స్టువర్టుపురంలో బజరంగ్ జగన్నామ సంక్షేమ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అంబటి మురళీకృష్ణ సోమవారం తెలిపారు. గ్రామంలోని మహిళలకు శానిటరీ నాప్‌కిన్లు పంపిణీ చేస్తామన్నారు. వలంటీర్లకు అవగాహన–పోటీ పరీక్ష, నిర్వహించి బహుమతులు అందజేయనున్నట్టు వివరించారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు , వలంటీర్లకు రూ.5లక్షల ప్రమాద బీమా పాలసీ వంటి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బజరంగ్ 'జగన్నామ సంక్షేమ దినం' కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రి, సంక్షేమసారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం రోజున గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో ఘనంగా ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. కొప్పురావూరు, వెనిగండ్ల, వెల్లలూరు, గుంటూరు, ముత్తాయపాలెం గ్రామాలలో ముగించుకొని ఈ నెల 7న మధ్యాహ్న 2 గంటలకు బాపట్ల మండలం స్టువర్టుపురంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. నారీరుతువు, విద్యావిజేత, థలసేమియా వ్యాధి పరీక్షలు, వలంటీర్లకు అవగాహన–పోటీ పరీక్ష వంటి కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలు

- ఒక్కరోజే జిల్లాలో 138 మందిపై కేసు నమోదు
- జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్



బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

బాపట్లటౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే జైలుకెళ్లడం ఖాయమని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. సోమవారం జిల్లా వ్యాప్తంగా దాడులు నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న మందుబాబులపై చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 138 మందిపై కేసులు నమోదుచేశారు. జిల్లా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై కొరడా ఝళిపించడం జరుగుతుందన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడపడం వలన అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురౌతున్నారన్నారు. మద్యం మత్తులో సాధారణ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే అలాంటి వారిని ఉపేక్షించేది లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో 27మంది, బాపట్ల సబ్ డివిజన్ పరిధిలో 58 మంది, చీరాల సబ్ డివిజన్ పరిధిలో 53 మంది జిల్లా వ్యాప్తంగా మొత్తం 138 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. వారిని త్వరలో కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు.

అర్జీలు నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలి

కలెక్టర్ విజయకృష్ణన్



బాధితుల నుంచి అర్జీలు స్వీకరించి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్ విజయకృష్ణన్

బాపట్లఅర్బన్: అర్జీలను నిర్ణీత సమయంలోపు పరిష్కరించాలని బాపట్ల జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలు పరిష్కరించాలంటూ 90 అర్జీలు అందించారు. వినతులపై స్పందించిన కలెక్టర్ తక్షణమే పరిష్కారమార్గం చూపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొన్నింటిని ఆయా శాఖల అధికారులకు కేటాయించగా మరికొన్నింటిని విచారణ, పరిశీలనకు ఆదేశించారు. తన పరిధిలో లేని వాటిని ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. స్పందన అర్జీలపై అన్ని శాఖల జిల్లా అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాగా ఏర్పడిన ఏడాది కాలంలోనే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, ప్రజలకు సేవలందించడంలో బాపట్ల జిల్లా 5వ స్థానంలో నిలిచేలా అధికారులు చేసిన కృషిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ప్రజలకు సేవలందించడంలో బాపట్ల జిల్లా మిగిలిన అన్ని జిల్లాలతో పోటీపడుతోందన్నారు. మౌలిక సదుపాయాలు లేకపోయినా అధికారులు చిత్తశుద్ధితో పనిచేశారని ప్రశంసించారు. లోపాలను అధిగమిస్తూ దిగువస్థానంలో ఉన్న బాపట్ల జిల్లా ముందుకు సాగేలా అధికారులు నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. అభివృద్ధి వైపు అడుగులు వేసేలా అధికారుల సహకారం, ప్రోత్సాహం అభినందనీయమన్నారు. అన్నీ శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేయడంతోనే సత్ఫలితాలు సాధించగలుగుతున్నామన్నారు. జిల్లాలో పరిపాలన సజావుగా సాగడానికి అధికారులంతా బాధ్యతతో వ్యవహరిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా స్పందనలో వస్తున్న అర్జీల పరిష్కారానికి అధికారులు ప్రాధాన్యం ఇవ్వడం సంతోషదాయకమన్నారు. సకాలంలో పరిష్కరించి ప్రజలలో సంతృప్తి స్థాయి పెంచారన్నారు. జగనన్నకు చెబుదాం పోర్టల్లో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నారని ఆమె వివరించారు. అధికారులంతా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు.

అధికారుల కృషి అభినందనీయం

బాపట్ల జిల్లాను తమ సొంత జిల్లాగా భావిస్తూ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని జిల్లా సంయుక్త కలెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. ఏడాది కాలంలో ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ సులభతరంగా పనిచేసేలా అవకాశాలు ఉండడం సంతోషదాయకమన్నారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకాలు, సూచనలతో బాపట్ల జిల్లా మరింత వేగంగా పురోభివృద్ధి వైపు పయనిస్తుందన్నారు. అధికారుల సమన్వయ సహకారంతోనే రాష్ట్రంలో 5వ స్థానానికి బాపట్ల జిల్లా చేరిందని వెల్లడించారు. అనంతరం జిల్లా అధికారులు తమ అనుభవాలను పంచుకున్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి కె.లక్ష్మీశివజ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో పాలన

- కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే బలరాం
- నూతన సచివాలయ భవనం ప్రారంభం



సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

వేటపాలెం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ, రైతుభరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి పాలన తీసుకొచ్చారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పేర్కొన్నారు. అక్కాయిపాలెం పంచాయతీ పరిధిలోని యానాది సంఘం వద్ద రూ.40 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో గ్రామాల్లో ప్రజలు పనుల కోసం దూర ప్రాంతంలోని మండల కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు గ్రామ వార్డు సచివాలయ వ్యవస్థలు అందుబాటులోకి తేవడంతో సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతున్నాయని చెప్పారు. కలెక్టర్ విజయకృష్ణన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బీకే భవనాలు నిర్మాణం జరగడంతో గ్రామాలు కొత్తరూపు సంతరించుకున్నాయన్నారు. అనంతరం సచివాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్, చీరాల మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, ఎంపీడీఓ శర్మ, మాజీ సర్పంచ్ వాసు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

14 నుంచి వామపక్ష పార్టీల ప్రచారజాత

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

బాపట్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకుపోయేందుకు ఈనెల 14 నుంచి వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ప్రచార జాత కార్యక్రమాన్ని చేపట్టబోతున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ప్రచార కార్యక్రమం చేపడతామని చెప్పారు. బాపట్లలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కె.రామకృష్ణ మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి మతోన్మాదశక్తులు పేట్రేగిపోతున్నాయని చెప్పారు. అదానీ రూ.లక్షల కోట్లు కుంభకోణం చేసినప్పటికీ ప్రతిపక్ష పార్టీలు 20 రోజులుగా పార్లమెంటులో జాయింట్ పార్లమెంటు కమిటీ వేయాలని పట్టుపట్టినప్పటికీ మోదీ సర్కారు మౌనంగా ఉండటాన్ని రామకృష్ణ దుయ్యబట్టారు. జాతీయ ప్రాజెక్టుగా ఉన్న పోలవరానికి నిధులు విడుదల చేయటంపై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావటంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం కనిపించిందన్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జంగాల అజయ్‌కుమార్, కౌన్సిల్ సభ్యులు పి.నాగాంజనేయులు, తన్నీరు శింగరకొండ, జేబీ శ్రీధర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

గుంటూరులీగల్:2023–24 సంవత్సరానికి జీబీఏ కార్యవర్గం ఏర్పాటైంది. సోమవారం ప్రెసిడెంట్ కె.వి.కె.సురేష్‌తోపాటు వైస్ ప్రెసిడెంట్ దాసరి ఉమామహేశ్వరరావు, జనరల్ సెక్రటరీ నాగవంశీకృష్ణ, ట్రెజరర్ విజయ రాజకుమార్, లైబ్రరీ సెక్రటరీ గేరా శ్యాం రత్నరాజ్, స్పోర్ట్స్, కల్చరల్ సెక్రటరీ గాలి అశోక్ ఆనంద్, లేడీ ఎగ్జిక్యూటివ్ పర్చూరి కుమారి(నంద), సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు ఎం.ఆదిలక్ష్మి, జి.అనూరాధ, జి.విజయకుమార్, పి.బాబూరావు, జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు రాజేష్ లింగం పూదోట, శ్రీనివాసరావు రాయపూడి (గుండు శ్రీను), జి.లక్ష్మి అధికారిక నియామక పత్రాలు పొందడంతోపాటు బాధ్యతలు స్వీకరించారు.

ట్రస్ట్ పేరుతో విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటం

- ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి డబ్బు వసూళ్లు
- పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



మురళీకృష్ణ

మార్టూరు: అనాథలు, నిరుపేద విద్యార్థులే లక్ష్యంగా వారి భవిష్యత్‌తో చెలగాటం ఆడుతున్న ఓ మోసగాడి లీలలు బయటపడ్డాయి. ఈ విషయమై సోమవారం స్థానిక పోలీస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు.. పర్చూరు మండలం నూతలపాడు గ్రామానికి చెందిన మురళీకృష్ణ స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గతేడాది తులసీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పేరుతో ఆఫీస్ ప్రారంభించాడు. కొంత కాలం తర్వాత మూసేశాడు. ఆ సమయంలో కరోనాతో మరణించిన వారి పిల్లలను, నిరుపేద విద్యార్థులను ఉచితంగా తమ ట్రస్ట్ ద్వారా ఇంజినీరింగ్ వంటి ఉన్నత విద్యను చదివిస్తామంటూ ఇంటర్ పాస్ అయిన విద్యార్థుల నుంచి ఒరిజనల్ సర్టిఫికెట్‌లు తీసుకున్నాడు. వీటి ద్వారా కొన్ని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజ్‌లలో ఉచిత విద్య అంటూ విద్యార్థులను నమ్మించి, కాలేజీల్లో చేర్పించి యాజమాన్యాలు ఇచ్చే కమీషన్‌లు తీసుకొని పబ్బం గడుపుకున్నాడు.

ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకొని..

చీమకుర్తికి చెందిన మృదులని ఉచిత విద్య అంటూ గుంటూరు సమీపంలోని సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కాలేజ్‌లో చేర్పించాడు. కానీ ఎటువంటి సాయం చేయలేదు. హాస్టల్ ఫీజుతోపాటు అన్ని ఫీజులు తానే చెల్లిస్తున్నానని, మురళీకృష్ణను నమ్మి మోసపోయానంటూ కన్నీటి పర్యంతమైంది. అదే మండలం కేవీ అగ్రహారానికి చెందిన హరితోటి త్రివేణి నుంచి 8 నెలల కిందట మురళీకృష్ణ 10వ తరగతి, ఇంటర్ ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకొని ఇంత వరకు తిరిగి ఇవ్వలేదని, ఫోన్ చేస్తే సమాధానం చెప్పడని త్రివేణి సోదరుడు వాపోయాడు. మార్టూరుకు చెందిన కే ప్రశాంత్ ఇంజినీరింగ్ పూర్తి చేయగా ఉద్యోగం ఇప్పిస్తానంటూ గత సెప్టెంబర్ 8వ తేదీన రూ.30 వేలు, 10వ తేదీన రూ.30 వేలు, మొత్తం రూ.60 వేలు గూగుల్ పే ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఉద్యోగం గురించి అడిగితే సమాధానం చెప్పడం లేదని బాధితుడు వాపోయాడు. సత్తెనపల్లికి చెందిన సీహెచ్ ధనుష్ రవికుమార్‌కు కూడా ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి గతేడాది ఆగస్టులో రూ.25 వేలు ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. ఉద్యోగం ఇప్పించలేదు కదా తన డబ్బు తనకు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు తన కుటుంబ సభ్యులతో ఫోన్ ద్వారా బెదిరిస్తున్నట్లు రవికుమార్ వాపోయాడు. సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా ఎస్సై కమలాకర్ దర్యాప్తు చేసి నిజానిజాలు తేల్చాలని ఏఎస్‌ఐ సైదాను ఆదేశించారు. మురళీకృష్ణ అరాచకాలపై దర్యాప్తుచేస్తే బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో అతని బారిన పడి మోసపోయిన విద్యార్థులు, నిరుద్యోగుల వివరాలు తెలిసే అవకాశం ఉందని, తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.